క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : అనుముల మండలంలోని రామడుగు సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలునాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పాలెం స్టేజీ దగ్గర ట్రాన్స్‌కో 400 కేవీ కొత్త లైన్ వేస్తుండడంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 132 కేవీ ఎర్రబెల్లి ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ పులిమామిడి ఫీడర్ పరిధిలోని రామడుగు సబ్ స్టేషన్ కింద విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.ఫీడర్ పరిధిలోని రామడుగు, చింతగూడెం, తిమ్మాపురం, కాసావారిగూడెం, కుపాసిపల్లి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగ దారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

అడవిదేవులపల్లి ఏఓగా సరిత



అడవిదేవులపల్లి : మండల వ్యవసాయశాఖ అధికారిగా (ఏఓ)గా గుర్రం సరిత శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉంటూ రైతులకు పంటలపై సలహాలు, సూచనలు ఇస్తానన్నారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన అధికారినికి సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రావుల నరేష్, కె. మహేష్‌నాయక్‌లతో పాటు పలువురు సిబ్బంది తదితరులున్నారు.

23 నుంచి మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్

చింతపల్లి : మండల స్థాయికబడ్డీ టోర్నమెంట్ సెలెక్షన్స్ 23, 24 తేదీల్లో జెడ్పీహెచ్ఎస్ కుర్మపల్లిలో నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి గురువారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీఎఫ్ నిబంధనలు అండర్ 14 విభాగంలో పాల్గొనే విద్యార్థుల జనవరి 01, 2011 తరువాత, అండర్ 17 లో పాల్గొనే విద్యార్థులు జనవరి 01, 2008 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. అలాగే అండర్ 14 పాల్గొని బాలికలు 48, బాలురు 51 కిలోల బరువు, అండర్ 17లో బాలికలకు 55, బాలురు 55కిలోల బరువు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. పై అర్హతలు ఉన్నవారు విద్యార్థులు 23 ఉదయం 9గంటలకు జెడ్పీహెచ్‌ఎస్ కుర్మపల్లి పాఠశాలలో రిపోర్టు క్రీడలకు విద్యార్థులను తీసుకువెళ్లే ఉపాధ్యాయులు ఒక్క రోజు ముందే విద్యార్థుల సంఖ్య ను డివిజన్ స్కూల్ గేమ్ సెక్రటరీ సౌజన్యను సంప్రదించాలని కోరారు.

ఆర్మీ జవాన్ కుటుంబానికి ఎంపీ పరామర్శ



జవాన్ మహేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

హాలియా : అస్సాం రాష్ట్రంలో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై మృతి చెందిన ఈరేటి మహేష్ కుటుంబాన్ని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అనుముల మండలంలోని మదారిగూడెంలో జవాన్ నివాసానికి వెళ్లి మహేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో అనుముల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, దేవస్థానం చైర్మన్ కొండారెడ్డి, నాయకులు సైదులు మాదిగ, కుందూరు రాజేందర్ రెడ్డి, మల్‌రెడ్డి భాను చందర్‌రెడ్డి ఉన్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

కొండమల్లేపల్లి : దళిత రత్న అవార్డు గ్రహీత బుర్రి వెంకన్నను టీజీ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు దళిత రత్న మద్దిమడుగు భిక్షపతి, టిజి ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు అన్నెపాక సంజీవ, ప్రధానకార్యదర్శి ఎర్ర ప్రసాద్, జడ చంటి, దర్శనం, దేవా, ఎలిమినేటి చిన్న యాదయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న జ్వర సర్వే

త్రిపురారం : జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం నిడమనూరు మండలంలో ఫీవర్ సర్వే నిర్వహించనట్లు మండల ఎంపీడీఓ భవనగిరి రమేష్, మండల వైద్యాధికారి డాక్టర్ రఫీ శనివారం తెలిపారు. 16 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఆరుగురు వ్యక్తులకు డెంగీ పరీక్షలు చేయగా నెగటివ్ వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈదులగూడెంలో..

మిర్యాలగూడ టౌన్ : జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఈదులగూడెంలో ఇంటింటి సర్వే చేశారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జ్వరాలతో పాటు సమస్యలు ఏమైనా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జ్వరం వచ్చిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సూపర్‌వైజర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

చివరి భూములకు నీరందేనా!



పిచ్చిమొక్కలతో నిండిన కిష్టాపురం మేజర్ కాల్వ



కిష్టాపురం మేజర్ కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

- చెట్లు, పూడికతో నిండిన కాల్వలు
- గతేడాది కూడా నిండని చెరువులు
- ప్రశ్నార్థకంగా మారిన 'చివరి' రైతుల సాగు

మిర్యాలగూడ : ఏఎమ్మార్పీ పరిధి నుంచి ఆయా మండలాలకు సాగునీరు అందించేందుకు వరద కాల్వలలు అధ్వానంగా తయారయ్యాయి. కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో చివరి భూములకు నీరందక సాగు ప్రశ్నార్థకంగా మారింది. వరద కాల్వ ద్వారా పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, తిప్పర్తి, మాడుగులపల్లి, వేములపల్లి మండలాల్లో సుమారు 80 చెరువులను నింపుతారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన ఈ వరదకాల్వ అధ్వాన్నంగా తయారుకావడంతో పంట కాల్వలు పూడిపోయి నానాటికి దిగుబడి తగ్గిపోతుందని రైతులు దిగాలు చెందుతున్నారు. గతంలో పూడికతీత పనులను చేపట్టడం ద్వారా చివరి భూములకు నీరందేది. దాంతో పాటు బోరుబావుల్లో సైతం భూగర్భజలాలు గణనీయంగా పెరిగేవి. దీంతో బోరుబావుల ద్వారా రైతులు సాగు చేసుకునేవారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వరదకాల్వ 81వ ప్యాకేజీలో 27 డిస్ట్రిబ్యూటరీలతోపాటు తూములు ఉన్నాయి. సాగర్ ప్రాజెక్టులో 570 అడుగులు నీటి మట్టం దాటగానే ఈ కాల్వకు నిరంతరంగా నీళ్లు వదిలే విధంగా నిర్మాణాలు చేపట్టారు. సాగర్ జలాశయం నిండడంతో ఇటీవల కలెక్టర్ ఎడమకాల్వ ద్వారా చెరువులను నింపుతామని ప్రకటించినప్పటికీ వరదకాల్వలో కంపచెట్లు, వ్యర్థాలతో నిండంతో చెరువులు నిండే పరిస్థితి కనపడడం లేదు.

గతేడాది ఎండిన చెరువులు

గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 80చెరువులు ఎండిపోయాయి. కాని ఈ ఏడాది ఎగువన వర్షాలు సమృద్ధిగా కురిసి నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారడంతో చెరువులకు జలకళ సంతరించుకుంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని, వరదకాల్వ చివరి భూములకు నీరందుతుందన్న రైతుల ఆశలు ఆవిరి అయ్యాయి. ఇప్పటికైనా స్పందించి వరదకాల్వలో పేరుకుపోయిన కంపచెట్లను, వ్యర్థాలను తొలగించి చెరువులను నింపాలని, చివరి భూములకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

కాల్వలను ఆధునీకరించాలి



"కిష్టాపురం మేజర్ కాల్వకు పూర్తి స్థాయిలో నీటి విడుదల చేయకపోవడంతో చివరి భూములకు నీరందడం లేదు. వేసిన బోర్లు సైతం ఎండుదశకు చేరాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉన్న ఎకరం పొలంలో పది గుంటలో కూరగాయలు పండిస్తున్నాను. వేసిన నారుమడులు సైతం ఎండిపోవడంతో మళ్లీ కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా నష్టపోతున్నా. రెండు కార్ల నుంచి నీరు వదలేదు. మేజర్లలో, మైనర్లను ఆధునీకరిస్తే ఈ సమస్య ఉండేది కాదు.

– గుగులోతు ధర్మా, బోట్యానాయక్‌తండా

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏపల్లి మండలానికి చెందిన 60 మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందన్నారు. సీఎం సహాయనిధిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్యయాదవ్, గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, పవన్‌కుమార్, నారాయణ రెడ్డి, నారాయణ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

మిర్యాలగూడ అర్బన్ : తమ సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని మిర్యాలగూడ డివిజన్ ఆరోగ్యమిత్రలు తెలిపారు. శనివారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ పథకంలో పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలకు మెరుగైన వైద్యం అందించడంలో కీలక భూమిక పోషిస్తున్నామని, కనీస వేతనం రూ.22వేల 750 ఇవ్వాలని కోరారు. తమను ఆరోగ్యమిత్ర కేడర్ డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలని, పీఆర్‌సీ అమలు చేసి వేతనాన్ని రూ. 35000 వేలకు పెంచాలని కోరారు. వేతనాలను అవుట్‌సోర్సింగ్ విధానంలో కాకుండా ట్రస్ట్ ద్వార చెల్లించి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆరోగ్య మిత్రలు బషీరుద్దీన్, పేరెల్లి శేఖర్, కంపసాటి నాగరాజు, చందాల ఇందిరారాణి, చెన్నబోయిన సుజాత, కందుల సాలయ్య, రామగిరి సుధాకర్, పల్లె క్రిష్ణ, సునీత, జుబేదా తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



డీ 37 కాల్వ మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

వేములపల్లి (మాడుగులపల్లి): రాష్ట్రంలోని రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం మాడుగులపల్లి మండలంలోని ధర్మాపురం గ్రామంలో డీ 37 కాల్వకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మరమ్మతు పనులను ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీని అనుకున్న సమయంలోపు అర్హులైన రైతులందరికీ అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులను అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన స్వల్పకాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసినట్లు పేర్కొన్నారు. నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా ఉందని నియోజకవర్గంలోని చెరువులన్నింటిని నింపి బీడు భూములను సస్యశ్యామలం చేస్తామన్నారు. అదేవిధంగా మాడుగులపల్లి మండల కేంద్రంలోని వరదకాల్వ కంపచెట్లతో, వ్యర్థాలతో పేరుకపోగా మాజీ జెడ్పీటీసీ పుల్లెంల సైదులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి జేసీబీతో కాల్వ మరమ్మతు పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, మండల పార్టీ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, సత్యం, నాయకులు సైదిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగారెడ్డి, శంకర్, దశరథ, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, రామాచారి, రవీందర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాగార్జున

వేములపల్లి : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావులపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

మిర్యాలగూడ అర్బన్ : మిషన్ పరివర్తన్‌లో భాగంగా టూటౌన్ పోలీసులు పట్టణంలోని శివానీ హైస్కూల్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాని స్కూల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

డిండి : జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామంలో శనివారం డ్రగ్స్ నిర్మూలనపై అధికారులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ డానియల్ హాజరై మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలను యువతకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పురుషోత్తం, హెచ్‌ఎం గోప్యానాయక్, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ అర్బన్ : కోల్‌కత్తాలో వైద్యురాలిపై అమానుషంగా దాడి చేసి ఆమె మృతికి కారణమైన నిందుతులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం మిర్యాలగూడ ఐఎంఏ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వైద్యులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. వైద్యుల ర్యాలీకి ల్యాబ్ అసోషియేషన్, మెడికల్ అసోషియేషన్, ప్రజా సంఘాల నాయకులు మద్దతుగా పాల్గొన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన అనంతరం నిందుతులను కఠినంగా శిక్షించాలని ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ముప్పా జ్యోతి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, ముప్పారామారావు, సరిత, రాజు, ఇంటూరి శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, వీటి ఉన్నారు.

దేవరకొండ : కోల్‌కత్తాలో పీజీ వైద్యురాలిపై హత్యాచారినికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దేవరకొండ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు వైద్యులు,వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంగ్తానాయక్,కృష్ణ,రవి, శాంతి స్వరూప, స్వప్న, రేణునాయక్,రంజిత్‌కుమార్, సిబ్బంది, ఉన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకుడు గోపిచంద్, అమితేష్, తులసిరాం, శివశంకర్, హరీష్, లతీఫ్, విక్రమ్, శంకర్, వినయ్ ఉన్నారు.

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యులు శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఉషారాణి, డాక్టర్ శివ, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

కోల్‌కత్తలో డాక్టర్‌పై హత్యాచారం చేసి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ ఉపాధ్యక్షులు నేరలపల్లి జై చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దు, రాజు, అనిల్, భవాని, పావని, సోని, మంజుల, రజిత, రమ్య, పల్లవి, రేణుక, సాహితి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : కోల్‌కత్తాలో మెడికల్ విద్యార్థిపై హత్యాచారినికి నిరసనగా శనివారం మండల కేంద్రంలోని వివిధ రాజకీయపార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగేష్, వెంకటయ్య, రామకృష్ణ, ఆంజనేయులు, సోమరాజుప్రదీప్‌కుమార్, కంచు కట్లసాయికుమార్, నల్ల శంకర్, శేఖర్, పాల్గొన్నారు.



మిర్యాలగూడ అర్బన్ : ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రందజేస్తున్న ఐఎంఏ వైద్యులు, విద్యార్థులు



దేవరకొండ : రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు



దేవరకొండ : నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు



డిండి : మాట్లాడుతున్న ఏబీవీపీ నేతలు

డిండి : జూనియర్ డాక్టర్ మౌమితపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి గౌరై కార్తీక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శ్రీనాథ్, అక్షయ్, నాగరాజు, రాకేష్, అరవింద్‌చరణ్, సాయి తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీ



వర్కాలలో రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చింతపల్లి : మండలంలోని పలు రేషన్ దుకాణాల్లో రెవెన్యూ అధికారులు శని వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'జోరుగా రేషన్ బియ్యం దందా' అనే శీర్షికతో సాక్షిలో శనివారం ప్రచురితమైంది. దీంతో దేవరకొండ డీటీసీఎస్ ముక్తార్, ఆర్ఐసీపెస్, సైదులు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రెండు రేషన్ దుకాణాలతో పాటు వర్కాల, ఘడియగౌరారం, నసర్లపల్లి ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్క తోవ పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ సరఫరాలో డీలర్లు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ప్రజలకునేరుగా అందించాలన్నారు. రేషన్ దుకాణ దారులు సమయపాలన పాటించి దుకాణాలు తెరవాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సముద్రాల ధనయ్య, ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లి నరేందర్, కోశాధికారిగా కర్నాటి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మున్సిపల్ చైర్మన్ నర్సింహా, లక్ష్మయ్య, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయం

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ మలిదశ ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయమని తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ యాదవ్, జిల్లా కార్యదర్శి లావూడి క్రాంతి కుమార్‌లు అన్నారు. శనివారం ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ టీజేఎస్ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కోదండరాంకు విద్యాశాఖపై పట్టుఉన్నందున మంత్రి పదవి ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుడిని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, మంత్రులు, ప్రజ్ఞాప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు సైదానాయక్, ప్రకాశ్‌నాయుడు, యాదవ సంఘం డివిజన్ నాయకులు మురళియాదవ్, కేపీ రాజు యాదవ్, బీసీ మహిళా సంఘం కార్యదర్శి బంటు కవిత, మంగునాయక్ తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న టీజేఎస్ నేతలు

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వ్యాపారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం సైతం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, పర్యావరణ ఇంజనీర్ సక్రునాయక్ పాల్గొన్నారు.

'మనోసంద్రాన' కవిత పుస్తకావిష్కరణ

హాలియా : తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత రచయిత కవి రఘువీర్ ప్రతాప్ రచించిన 'మనోసంద్రాన' కవిత పుస్తకాన్ని సిలువేరు సాహితీ సేవా కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రచయితలు ఆవిష్కరించారు. తొలి కాపీ అందుకున్న జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు ఎన్ సంజీవరెడ్డి మాట్లాడుతూ కవి రచయిత రఘువీర్ మనోసంద్రాన అనే కవి పుస్తకాన్ని మణిపూసలు ప్రక్రియలో రాసినట్లు తెలిపారు. కవి రచయిత డాక్టర్ హసనా మాట్లాడుతూ రఘువీర్ ప్రతాప్ వృత్తిరీత్యా అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్నా కవిగా, రచయితగా రాణిస్తున్నారని ఆయన అభిరుచిని మెచ్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామోజీ హరికృష్ణ, లింగమూర్తి ఉన్నారు.



కవిత పుస్తకం ఆవిష్కరిస్తున్న రచయితలు

గురుకుల భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండల కేంద్రంలో చేపడుతున్న గిరిజన బాలుర గురుకుల పాఠశాల సొంత భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ అన్నారు. శనివారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్మిస్తున్న గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలో వందలాది మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని వారికి అద్దె భవనంలో అరకొర వసతులు నడుమ విద్యను కొనసాగిస్తున్నారని, కనీసం తాగునీరు, మరుగుదొడ్లు కూడా లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి గురుకుల పాఠశాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. లేనట్లయితే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కుర్ర సైదానాయక్, ధీరావత్ వీరన్ననాయక్, కల్యాణ్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు